సాక్షి
బాపట్ల
సోమవారం । 11 । మార్చి । 2024



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

జయ జయ జయహో..

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.

సిద్ధం సభ జన సంద్రం

- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం...నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రారెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేను సైతం..

అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం...., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.

ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత

క్లుప్తంగా

పోలీసు సిబ్బందిని అభినందించిన ఐజీ పాలరాజు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం పీ గుడిపాడు సమీపంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభను కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిందని.. విధులు నిర్వహించిన ప్రతి ఒక్క పోలీసు అధికారులకు, సిబ్బందికి గుంటూరు ఐజీ పాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సమర్థంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ప్రశాంతంగా ముగిసిందని ఐజీ పేర్కొన్నారు.

మహిళ దారుణ హత్య

గుంటూరు ఈస్ట్: మహిళ దారుణ హత్యకు గురైన ఘటన నగరంలో కలకలం రేపింది. పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీలో నివసించే ఆశ ఆరు నెలల కిందట రాజమండ్రి నుంచి గుంటూరు వచ్చింది. మొదట శివ అనే వ్యక్తిని వివాహం చేసుకుని విడిపోయింది. అనంతరం దుర్గారావుతో సహజీవనం చేసి విడిపోయింది. ఆశకు నలుగురు పిల్లలు ఉన్నారు. గతంలో మూడో వ్యక్తితో సహజీవనం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఆశ ఓ వ్యక్తితో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మూడు వంతెనల వద్ద దుర్గారావు వారిని అడ్డుకున్నాడు. తనతో తిరిగి సహజీవనం చేయాలని కోరాడు. ఆశ అందుకు నిరాకరించింది. దీంతో దుర్గారావు బెదిరించాడు. అయితే, అనూహ్యంగా ఎంప్లాయీస్ కాలనీ మెయిన్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున నడిరోడ్డుపై శవమై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆశ మృతదేహం

రైల్వే డివిజన్‌లో పలు ప్రాజెక్టులు జాతికి అంకితం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని తొమ్మిది రైల్వే స్టేషన్లలో వివిధ ప్రాజెక్టులు పూర్తయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈనెల 12న జాతికి అంకితం చేయనున్నట్లు డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ వెల్లడించారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆయా స్టేషన్లలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం కె.కమలాకర్ బాబు, డీఈఎస్ వెస్ట్ గౌతమ్ పాల్గొన్నారు.

పండుగలా కదిలొచ్చారు..


చెరుకుపల్లిలో 'సిద్ధం'కు వెళ్తున్న కార్యకర్తలతో కలసి నినాదాలు చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

భూమిని మింగేసి, రైతును మాయం చేసి, పెత్తందారులు దోపిడీకి తెగబడగా చమట చుక్క చిన్నబోయి.. కంటనీరు పెడుతుండగా.. నాగలినే అజెండా చేసుకుని వెంట నడిచిన ధీరుడు..
జగనన్న అవ్వాతాతలకు ఆసరా లేక చీకటిలో మగ్గుతుంటే వెలుగులు నింపగా.. చేతి వృత్తులు దివాళా తీసి దిక్కుతోచక చతికిలపడగా.. డ్వాక్రా రుణమాఫీ లేక అక్క చెల్లెమ్మలు అప్పులపాలు కాగా.. దొరలచేతిలో చిక్కిన చదువులు చట్టుబద్ధలవుతుండగా.. వ్యవస్థలను చక్కదిద్దేందుకు వచ్చిన మడమతిప్పని మహోద్యమకారుడు..
గ్రామ సచివాలయ వ్యవస్థతో ఉద్యోగాల కల్పకుడు..
సిద్ధమై వచ్చిన జగనన్నను చూసిన ఆనందంలో లక్షలాది కళ్లు కాంతిరేఖలై ఆ ప్రాంగణాన్ని ఇంద్ర ధనస్సులా మార్చాయి. సంక్షేమ సారథి మళ్లీ నువ్వే సీఎం జగనే కావాలంటూ ఆశీర్వదించారు. –సాక్షి నెట్‌వర్క్


భట్టిప్రోలులో సిద్ధం సభకు బస్సులో వెళ్తున్న కార్యకర్తలతో వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

జగనన్న విద్యాదీవెనతోనే చదువు పూర్తి



గత ప్రభుత్వంలో పేదవాడికి విద్య అందని ద్రాక్షగా మారింది. నేడు ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వంలో నాడు–నేడుతో విద్యాలయాలు సరస్వతి నిలయాలుగా మారాయి. నేను కూడా విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో బీటెక్ పూర్తి చేశాను. నా తమ్ముడు విద్యా దీవెన పథకంలో చదువుకున్నాడు. మా కుటుంబానికి రైతు భరోసా, చేయూత పథకాలందాయి. మామూలుగా అయితే మాకు చదివే పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆశిస్తున్నా.

– కరేటీ కిరణ్‌కుమార్, నెల్లూరు జిల్లా

వైఎస్సార్ వాహన మిత్రతో భరోసా



నేను ఆటో నడిపితేనే కుటుంబం గడిచేది. ఆటో మీద వచ్చిన ఆదాయం కిస్తీలకే సరిపోదు. ప్రభుత్వం ఏమైనా చేయూత అందిస్తుందా అంటే గత ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టడంతో కిస్తీలకు ఇబ్బందులు లేకుండా పోయాయి. సొంతిల్లు కట్టుకున్నాను. పిల్లలకు అమ్మ ఒడి డబ్బులు పడ్డాయి. చాలా సంతోషంగా ఉన్నాను. ఆ సంతోషంతోనే కుటుంబంతో కలిసి సిద్ధం సభకు హాజరయ్యాను.

– మాబు సుభాని, జె.పంగులూరు, బాపట్ల జిల్లా

అభిమానంతోనే సభకు హాజరవుతున్నా..



ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివాను. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాను. మా కుటుంబానికి ప్రభుత్వ పథకాలన్నీ అందజేసిన సీఎం వైఎస్ జగనన్న కార్యక్రమం ఎక్కడున్నా అభిమానంతో ఆ సభకు హాజరవుతున్నాను.

– ఆర్.అమర్‌నాథ్, కొత్తవీడు గ్రామం, ప్రొద్దుటూరు మండలం, కడప జిల్లా

జగనన్న సింగిల్‌గానే గెలుస్తాడు..



ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా జగనన్న సింగిల్‌గా గెలుస్తాడు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలే ఆయన గెలుపునకు పునాదులు వేస్తాయి. ప్రతిపక్షాలన్నీ ఏకమైనా ఒక సిద్ధం సభకు సమాధానం చెప్పలేరు. ఈ సభలకు హాజరయ్యే జనసందోహం చూస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ వచ్చినట్లే అనిపిస్తుంది.

– అద్దంకి హేమలత, రెడ్డిపాలెం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా

జగనన్న సీఎం అయితేనే పథకాలు అమలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోయే పరిస్థితి ఉంది. సీఎం వైఎస్ జగన్ కుల, మత, వర్గాలకు అతీతంగా పథకాలను అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యదర్శుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ ద్వారా మా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. నా తల్లిదండ్రులు చనిపోయినా జగనన్న ప్రవేశపెట్టిన పథకాలతో సంతోషంగా జీవిస్తున్నాను.

– గుడిపూడి అంకరావు, వినుకొండ

అన్ని పథకాలు అందుతున్నాయి..



నేను ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం నాకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేలు అందుతున్నాయి. నా పిల్లలకు అమ్మ ఒడి, నా భార్యకు వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో పాటు మా అమ్మకు పింఛన్ కూడా వస్తోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉన్నాం.

– పులిపాటి సుబ్బారావు, పర్చూరు, బాపట్ల జిల్లా

సొంతింటి కల నెరవేరింది ..



నేను తిరుపతిలో బొమ్మలు అమ్ముకుని జీవిస్తుంటాను. మాది రెక్కాడితేనే డొక్కాడని కుటుంబం. సొంత ఇల్లు కట్టుకుంటామని కలలో కూడా అనుకోలేదు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణం కోసం నగదు ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాను. కాపు నేస్తం డబ్బులు పడ్డాయి. హాయిగా సొంతింటిలో సంతోషంగా ఉంటున్నాను. ఇప్పుడు మా జీవితాలకు ఎటువంటి ఢోకా లేదు.

– పోలిశెట్టి మాల్యాద్రి, తిరుపతి

సంతోషంగా జీవిస్తున్నాను..



గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల కోసం నేను దివ్యాంగుడైనప్పటికీ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఏ పనీ జరిగేది కాదు. ఈ ప్రభుత్వంలో అడగకుండానే వలంటీర్ పింఛన్ అందిస్తున్నాడు. త్రీ వీలర్ వచ్చింది. దానిపై కుటుంబ పోషణ నిమిత్తం ఎక్కడికైనా వెళ్లి రాగలుగుతున్నాను. అమ్మ ఒడి నగదుతో మా పిల్లలు బాగా చదువుతున్నారు. ఇన్ని పథకాలు గత ఏ ప్రభుత్వంలో కూడా అమలు కాలేదు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– డి.వెంకటేశ్వర్లు, మార్టూరు, బాపట్ల జిల్లా

అర్హత ఉంటే చాలు..



సీఎం వైఎస్ జగన్ మాకు సంక్షేమ పథకాలతో ప్రజా రంజకపాలన అందించారు. మా ఇంట్లో అన్ని పథకాలు అందాయి. గత ప్రభుత్వంలో ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రవేశపెట్టలేదు. ప్రవేశ పెట్టిన పథకం ప్రజలకు అందకుండా జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయి. ఇప్పుడు ఆ విధంగా లేదు. అర్హత ఉంటే చాలు..పథకాలు అందుతున్నాయి. మా దేవుడు జగన్.. ఆయనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– డి.ఏసేబు, బాపట్ల జిల్లా

సంక్షేమ సారథి సీఎం జగన్



ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటిని సీఎం అయ్యాక నెరవేర్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఈ పథకాలన్నీ అమలు జరగాలంటే తిరిగి జగన్‌ను సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– వై.చిన్నవెంకటరెడ్డి, మార్కాపురం

వలంటీర్ వ్యవస్థ అద్భుతం



సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అద్భుతం. కరోనా కష్టకాలంలో సైతం ఈ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. అలాంటి వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి.

– చౌదరి సాయి, కొత్తూరు గ్రామం, అనకపల్లి జిల్లా

రైతు పక్షపాతి



సీఎం జగన్ రైతు పక్షపాతి. ఎన్నో రకాలుగా వారిని ఆదుకుని మనోధైర్యాన్ని కల్పించారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచిత విత్తనాలు, సబ్సిడీపై నాణ్యమైన ఎరువులు అందజేస్తున్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ.. రైతుకు అండగా ఉంటానని సీఎం జగన్ చాటి చెప్పారు.

– యు.మురళి, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా

ఎంత మంది వచ్చినా జగన్‌ను ఆపలేరు



రానున్న ఎన్నికల్లో ఎంత మంది ఏకమైనా సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ అడ్డుకోలేరు. చంద్రబాబు, పవన్, బీజేపీతో పాటు ఎన్ని తోక పార్టీలు వచ్చినా 175కి 175 సీట్లు రావడం ఖాయం. రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారు. – బి.సుబ్బారావు, గుంటూరు

విద్య, వైద్య రంగాలు భేష్..



విద్య, వైద్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చి వాటిని అమలు చేసి పేదలకు మేలు చేశారు. భావి తరాలకు భరోసానిచ్చారు. తిరిగి ఆయన సీఎం అవడం ద్వారానే విద్య, వైద్య రంగాలు మరింత బలోపేతంగా ఉంటాయి. ఆయన్ను సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– వినుకొండ ఫణీంద్రకుమార్, అద్దంకి

సంక్షేమమే సంకల్పం



మా కుటుంబంలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలన్నీ అందాయి. మా అమ్మమ్మకు పింఛన్, మా అన్న కుమారుడికి అమ్మ ఒడి, నా భార్యకు ఇంటి స్థలం అందాయి. సంక్షేమ పథకాల ద్వారా ఎంతో సంతోషంగా ఉన్నాం. మళ్లీ జగన్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం.

– తలతోటి మనోహర్, కందుకూరు

చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదు



నాది అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామం. నా వయస్సు 75 సంవత్సరాలు. నేను నా జీవితంలో చాలామంది రాజకీయ నాయకులను చూశాను. కానీ చంద్రబాబు అంత నమ్మక ద్రోహిని ఎన్నడూ చూడలేదు. ఎన్నికల ముందు చెప్పిన మాటలు ఎన్నికల అయిన వెంటనే గాలికొదిలేస్తారు. రాజశేఖరరెడ్డి కుటుంబం అంటే రాష్ట్రానికి ఓ భరోసా. వారు మాట ఇచ్చారంటే అది ఎంతటి పని అయినా చేసి చూపిస్తారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబు నోటికి వచ్చినవన్నీ చెబుతాడు. ఆయన ఎన్ని చెప్పినా ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో జనం లేరు.

– బాదం రామస్వామిరెడ్డి

మా దేవుడు జగనన్న



నాది జె.పంగులూరు మండలం రేణంగివరం గ్రామం. నాకు ఇద్దరు పిల్లలు. నాకు ఎనిమిదేళ్ల కింద పెళ్లి అయ్యింది. అప్పటి నుంచి నేను, నా భర్త ఇద్దరు పిల్లలు అద్దె ఇంట్లో ఉంటున్నాం. నాకు సొంతిల్లు నిర్మించుకోవాలని ఎప్పటి నుంచో కోరిక. నేను కలలు కనడం తప్ప, నా కోరిక తీరదు అనుకుంటూ ఉండేదానిని. జగనన్న సీఎం అయిన తర్వాత నా పేరుతో ఇంటి స్థలం ఇచ్చారు. నా పేరుతోనే రిజిస్ట్రేషన్ కూడా చేశారు. అంతేకాదు నాకు ప్రభుత్వం అందించే ప్రతి పథకం అందుతుంది. మేము సంతోషంగా ఉంటున్నాం అంటే అది జగనన్న పుణ్యమే. అందుకే నా ఇద్దరు పిల్లలతో సహా నేను కష్టమైనా సిద్ధం సభకు వచ్చాను.

– కుమ్మిత అనూష కుటుంబం

జగనన్న కోసం రాష్ట్రమంతా..



శ్రీకాకుళం జిల్లా, గారి మండలం, అంప్రోలు గ్రామానికి చెందిన వ్యక్తిని. నేను రూ.4.5 లక్షలతో బీఎండబ్ల్యూ ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి, రూ.50 వేలతో ద్విచక్రవాహనానికి ప్రత్యేకంగా వైఎస్సార్ సీపీ రంగులు వేయించుకున్నాను. జగనన్న సభలు ఏ ప్రాంతంలో జరిగితే ఆ ప్రాంతానికి తిరుగుతున్నాను. నేను గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసుకునేవాడిని. జగనన్న పేదల కోసం పడుతున్న తాపత్రయం చూసి ఆయనకు అభిమానిగా మారాను. జగనన్నను మళ్లీ సీఎం చేసేంతవరకు నేను రాష్ట్రం మొత్తం తిరుగుతూనే ఉంటాను. – జి.సన్యాసిరావు, శ్రీకాకుళం

పేదరిక నిర్మూలనకు కృషి..



ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. నాడు–నేడు, అమ్మ ఒడి, విదేశీ విద్య, వంటి పథకాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ఎంతో మేలు చేశారు. పలు పథకాల ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారు.

– బి.వెంకటకృష్ణ, మాల్యవంతునిపాడు, మార్కాపురం

ప్రశాంతంగా 'గురుకుల'ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 117 మంది గైర్హాజరయ్యారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం నిర్వహించిన పరీక్షకు మొత్తం 190 మందికి గాను 155 మంది, అలాగే మధ్యాహ్నం ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు మొత్తం 228 మందికి గాను 209 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ ఎస్. శైలజ తెలిపారు. రామకృష్ణాపురంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 212 మందిగాను 160 మంది, ఇంటర్మీడియెట్‌కు 101 మందికి గాను 90 మంది హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో ప్రవేశ పరీక్షలు జరిగాయి.

వైఎస్సార్‌కు భారతరత్న కోసం కోటి సంతకాల సేకరణ

చీరాల టౌన్: చరిత్రలో చెరగని ముద్ర వేసుకుని అన్ని వర్గాలకు అండగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి భారతరత్న ఇవ్వాలని కోరుతూ చిలకలూరిపేటకు చెందిన భాస్కరరెడ్డి, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సిద్ధం సభ వద్ద సభకు వచ్చిన వారితో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు 89 వేల మంది ప్రజలతో సంతకాలు చేయించానని, భారతరత్న అవార్డు వైఎస్సార్‌కు ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కేంద్రం చొరవ తీసుకుని వైఎస్సార్‌కు భారతరత్న అందించాలని కోరారు. ఈ కోటి సంతకాలను కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వెల్లడించారు.


సంతకాలు చేయిస్తున్న భాస్కరరెడ్డి

హరోం..హర అమరేశ్వర


ప్రత్యేక అలంకరణలో అమరేశ్వర స్వామి


అమరేశ్వరస్వామి రథోత్సవం

- భక్తజన సంద్రం అమరావతి
- వైభవంగా అమరేశ్వరుని రథోత్సవం


అమరేశ్వరస్వామి, బాల చాముండేశ్వరి ఉత్సవమూర్తులు

అమరావతి: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమరావతి క్షేత్రంలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దివ్య రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాల చింకా, ఆలపాటి, కోనూరు, కామిరెడ్డి వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ గాలిగోపురం నుంచి ప్రారంభమైన రథోత్సవం మేళతాళాలతో, భక్తుల శివ నామ స్మరణతో నందీశ్వరుడు ముందుండి నడిపిస్తుండగా అత్యంత వైభవోపేతంగా సాగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో అమరావతి భక్తజన సంద్రమైంది. 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.